క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ ఆకస్మిక తనిఖీ




అల్లూరులో ఏడుకొండలమ్మకు ఇస్తున్న పింఛన్‌ను తనిఖీ చేస్తున్న ఏపీవో వరప్రసాద్

అల్లూరు (కొత్తపట్నం): మండలంలో వలంటీర్ల పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ ఏపీవో జి.వరప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్లూరు–1 సచివాలయం పరిధిలో వలంటీర్ భార్గవి ఇస్తున్న పింఛన్‌ను ఆయన స్వయంగా పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పింఛన్‌దారు కిష్టం ఏడుకొండలమ్మతో మాట్లాడుతూ నెలలో ఒకటో తేదీ ఇస్తున్నారా.. ఆలస్యంగా ఇస్తున్నారా, అసలు ఈ ప్రాంతానికి వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉదయం 6 గంటలకే ఇంటికొచ్చి రూ.2,750 పింఛన్ ఇస్తున్నారని, ఎటువంటి ఇబ్బంది లేదని, ప్రతి నెలా ఇస్తున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు పింఛన్లను ఒకటో తేదీనే నూరు శాతం పంపిణీ చేయాలని సూచించారు. మండలంలో ఎవరైనా అర్హులుంటే వెంటనే పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పింఛన్‌దారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ జి.రంగనాథ్, వలంటీర్ భార్గవి పాల్గొన్నారు.

రేపు జవహర్ నవోదయ పూర్వ విద్యార్థుల సమావేశం

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఈ నెల 3వ తేదీ విద్యాలయంలో నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు డాక్టర్ డి.తిరుమల రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రత్నాకర్‌బాబు తెలిపారు. 1986వ సంవత్సరం నుంచి చదువుకున్న విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



ప్రత్యేక అలంకరణలో విజయ గణపతి

ఒంగోలు మెట్రో: గణపతికి ప్రీతికరమైన కార్తీకమాసం సందర్భంగా నగరంలోని వినాయకుని ఆలయాల్లో శుక్రవారం సంకట హర చతుర్థి వేడుకలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. నగరంలో రాజాపానగల్‌రోడ్లోని లక్ష్మీగణపతి దేవాలయం, అద్దంకి బస్టాండు వినాయకుడి దేవాలయం, కర్నూల్ రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవాలయం, శ్రీనగర్‌కాలనీ మొదటి లైన్లో గల విజయ్ గణపతి దేవాలయం, మణికంఠనగర్‌లోని కార్యసిద్ధి గణపతి దేవాలయం, బాపూజీ మార్కెట్లోని మహాగణపతి దేవాలయంలో స్వామివారి మూలవిరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.

గుంటూరులో కేఎన్‌పీఎస్ రాష్ట్ర సదస్సు

చీమకుర్తి: మనుస్మృతికి వ్యతిరేకంగా కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కేఎన్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం దానికి సంబంధించిన కరపత్రాలను చీమకుర్తి పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం స్థానంలో ఆధునిక మనుస్మృతిని రాజ్యాంగంగా అమలు చేయాలని 2024లో అధికారంలోకి వస్తే హిందూ మతోన్మాద పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. వాటిని తిప్పికొట్టేందుకు డిసెంబర్ 6న అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా గుంటూరు ఆర్య సమాజ భవనంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు చీమకుర్తి మండలం నుంచి ఎక్కువ మంది హాజరుకావాలని కేఎన్‌పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ నాయకులు గంటినపల్లి పోతురాజు, ఆరెతోటి రాంబాబు, కొండలు, డేవిడ్‌రాజు, కిషోర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రిజిస్టర్ వాడని సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

ఒంగోలు సబర్బన్: వార్డు సచివాలయాల పరిధిలో మూమెంట్ రిజిస్టర్ వాడని సిబ్బందిపై నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని సుజాత నగర్ వార్డు సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలో జరుగుతున్న డివైడర్లపై మొక్కల పెంపకంతో పాటు పారిశుధ్య పనులను కూడా పర్యవేక్షించారు. సుజాతనగర్ సచివాలయ సిబ్బంది మూమెంట్ రిజిస్టర్‌ను ఎందుకు వాడటం లేదని నిలదీశారు. అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

ఈనెల 5 లోగా పది పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: పదో తరగతి పరీక్ష ఫీజును ఈనెల 5వ తేదీలోగా అపరాధ రుసుము లేకుండా చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 10వ తేదీలోపు, రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 12వ తేదీలోపు, రూ.500 అపరాధ రుసుముతో ఈనెల 14వ తేదీలోపు చెల్లించవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎం జగనన్నకే మద్దతివ్వాలి

● మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: జగనన్నే మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మద్దిపాడు మండలంలోని లింగంగుంట గ్రామ సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటే జగనన్ననే మరోమారు ముఖ్యమంత్రి కావాలన్నారు. పార్టీ, కులం, మతం, వర్గ విభేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి దేశానికే రోల్‌మోడల్‌గా సీఎం జగనన్న నిలిచారని వివరించారు. అటువంటి వ్యక్తిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామని, ప్రతిఒక్కరూ జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వం కేవలం హామీలకు మాత్రమే పరిమితమైందని, కానీ జగనన్న ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన పనులే కాకుండా చెప్పనివి కూడా అందించిందని అన్నారు. ఒక్క లింగంగుంట గ్రామానికే డీబీటీ నాన్‌డీబీటీ కింద రూ.16 కోట్ల పైచిలుకు డబ్బులు అందాయని, గ్రామంలో అభివృద్ధి పనులకు మరో నాలుగు కోట్ల రూపాయలకుపైగా అందాయని తెలిపారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి గ్రామంలో ఇళ్ల వద్దకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం కావాలో వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, నాయకులు జనార్దన్, శ్రీకాంత్, షేక్ బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ విప్లవం తెచ్చిన జగనన్నే మళ్లీ సీఎం కావాలి...

కొత్తపట్నం: రాష్ట్రంలో సంక్షేమ విప్లవం తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని పాదర్తి సర్పంచ్ కట్టా సౌందర్య, రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప అన్నారు. రంగాయపాలెం సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ సీఎంగా జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగాయపాలెం సచివాలయం పరిధిలో రూ.27.01 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటికొచ్చి సంక్షేమ పథకాలు అందించడం చూస్తున్నామన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం మీద ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. చిన్న సచివాలయంలో నాలుగున్నర సంవత్సరాల్లో రూ.27.01 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేసి బ్యాంక్ అకౌంట్లలో నగదు జమ చేయడం మనందరం చూస్తున్నామన్నారు. ఈ పథకాలన్నీ ఉండాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని తెలిపారు. గాలి స్వరూప మాట్లాడుతూ ప్రజలంతా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో పథకం కోసం వెళితే జన్మభూమి కమిటీలు చెబితేనే వచ్చేదని గుర్తు చేశారు. రంగాయపాలెం, పాదర్తి పంచాయతీలు కలుపుకుని పింఛన్, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా నాలుగున్నర సంవత్సరాలలో రూ.27.01 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. నోడల్ అధికారి ఏ బాలచెన్నయ్య, సంక్షేమ, అభివృద్ధి పథకాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, గాలి ముసలారెడ్డి, ఏపీఎం షేక్ రజియాసుల్తాన్‌బేగం, ఏవో మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీకి సీఎం జగన్ ఆవశ్యకత అందరికీ తెలుసు

నాగులుప్పలపాడు: ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకు అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవశ్యకత రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొత్తకోట గ్రామ సచివాలయం పరిధిలోని తక్కెళ్లపాడు, కొత్తకోట గ్రామాల ప్రజలకు అందిన సంక్షేమ పథకాల బోర్డును సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాలను వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కుమారి, నాయకుడు యోహాను, తదితరులు పాల్గొన్నారు.



లింగంగుంటలో పథకాల పట్టికను ప్రదర్శిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండవ అప్పారావు, నాయకులు

మైనంపాడు గ్రామంలో...

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో ఇప్పటి వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి రూ.34 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించినట్లు వివరించారు. అనంతరం పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ డీ రమణమ్మ, ఎంపీటీసీ ఏ రాజకుమారి, దుంపా యలమందారెడ్డి, జీ సుబ్బారావు, గొడుగు మస్తాన్, కాలేషా, స్థానికులు పాల్గొన్నారు.

ఇలపావులూరులో...

చీమకుర్తి మండలం ఇలపావులూరులో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాల గురించి వివరించారు. రూ.14 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగినట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ పులి రమణమ్మ–రత్తయ్య, స్థానికులు పాల్గొన్నారు.



మైనంపాడులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి



రంగాయపాలెం సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్‌లు



కొత్తకోట సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ప్రదర్శిస్తున్న నాయకులు



ఇలపావులూరులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

మాగుంట సుబ్బరామరెడ్డికి ఘన నివాళి

అల్లూరు (కొత్తపట్నం): దివంగత ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, మడనూరు అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అల్లూరు, మడనూరు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. సుబ్బరామరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మాగుంట సుబ్బరామరెడ్డి ఎంపీగా నామినేషన్ వేసిన తర్వాత ఆనవాయితీగా ఈశాన్యంలో ఉన్న అల్లూరు గ్రామాన్ని ఎన్నుకుని ప్రచారం ప్రారంభించేవారని గుర్తు చేశారు. అల్లూరును అభివృద్ధి చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి కోటేశ్వరమ్మ, మడనూరు సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, కోఆప్షన్ మెంబర్ బాజీ, వాయల రోశయ్య, కసుకుర్తి ఏసురత్నం, కృష్ణారెడ్డి, శెట్టి జాలరావు, రాతికింద ప్రభాకర్‌రావు, రామలింగారెడ్డి, స్వర్ణ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరులో మాగుంట సుబ్బరామరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రోశయ్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

ఒంగోలు టౌన్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఆర్యవైశ్యులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రోశయ్య విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఒంగోలు సూపర్‌బజార్ చైర్మన్ తాతా బద్రీనాథ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ఒంగోలు నగరం నడిబొడ్డున బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగా డిసెంబర్ 4వ తేదీ రోశయ్య విగ్రహావిష్కరణ జరుగుతుందని తెలిపారు. రోశయ్య ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సొంత నిధులతో విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. అందరికీ ఆమోదయోగ్యమైన మంచి నాయకుడు రోశయ్య విగ్రహాన్ని ఒంగోలులో ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్ కుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మార్కాపురం చిల్లంచెర్ల బాలమురళీకృష్ణ, ఆర్యవైశ్య జిల్లా నాయకులు రావూరి కాశీరంగ జనార్దన్, చలువాది బద్రి నారాయణ, ఇమ్మడిశెట్టి సత్యనారాయణ, తాతా ప్రసాద్, బొగ్గవరపు సుబ్బారావు, కోట హనుమంతరావు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహావిష్కరణ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శిద్దా, తదితరులు

క్రీడల్లో అంతర్జాతీయస్థాయిలో రాణించాలి

● ఎస్పీ మలికాగర్గ్



ప్రణవిని అభినందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: షూటింగ్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరచడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందాలని ఎస్పీ మలికా గర్గ్ ఆకాంక్షించారు. నవంబర్ 19 నుంచి 26వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 66వ జాతీయ 10 మీటర్ల పిస్టల్ షూటింగ్ జూనియర్ మిక్స్‌డ్ టీం విభాగంలో హోరాహోరీగా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కొత్తపట్నం మండలం రంగాయపాలెం గ్రామానికి చెందిన ప్రణవి ప్రతిభ ప్రదర్శించి కాంస్య పతకాన్ని సాధించింది. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రణవిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా జాతీయ గ్రూప్ ఏ టీంకు సెలక్ట్ కావడం, గోవాలో జరిగిన 37వ నేషనల్ గేమ్స్‌లో ఆల్‌ఓవర్ ఇండియాలో 11 స్థానంలో నిలిచినందుకు ఎస్పీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రణవి తల్లిదండ్రులు జాలిరెడ్డి, ప్రగతి, షూటింగ్ జిల్లా సెక్రటరీ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

పోలీసుల సమస్యలకు సత్వర పరిష్కారం...

విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సంక్షేమ దివస్ నిర్వహించారు.

రేపటి నుంచి వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు

ఒంగోలు మెట్రో: సత్యసాయి సేవా సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో యోగాసన, ప్రాణాయామ, ధ్యాన, వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులను నగరంలోని మంగమూరురోడ్డులో గల శ్రీ సత్యసాయి సేవా సమితి మందిర ప్రాంగణంలో ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కొడెల శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం ఐదు గంటలకు పతంజలి యోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ యోగా మాస్టర్ యోగాచార్య బాలు సహకారంతో యోగా తరగతులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పది సంవత్సరాలు పైబడిన విద్యార్థులకు 365 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. నగర, పరిసర ప్రాంత ప్రజలంతా వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. యూత్ వింగ్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంచి వైద్యులుగా గుర్తింపు పొందండి

ఒంగోలు టౌన్: ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవాలని స్థానిక జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్ సూచించారు. సర్జికల్ విభాగంలో పీజీలో చేరిన 11 మంది విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం జీజీహెచ్ సర్జికల్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రజనీదేవి అధ్యక్షతన నిర్వహించారు. పీజీ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, ఇన్‌చార్జి ఆర్‌ఎంఓ డాక్టర్ తిరుమలరావు, సర్జికల్ విభాగం వైద్యులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మోటుమాలలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.సుజాత కోరారు. మండలంలోని మోటుమాల, పాదర్తి గ్రామాల్లో సర్పంచ్‌లు కోడూరి గోపి, కట్టా సౌందర్య అధ్యక్షతన వికసిత భారత్ సంకల్ప యాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలపై వికసిత భారత్ సంకల్ప యాత్రలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎంత మంది లబ్ధి పొందారో వివరించారు. వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం కింద లబ్ధిపొందిన వారితో మేరీ కహానీ మేరీ జుబానీలో భాగంగా విజయ గాథలు చెప్పించారు. ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, డాక్టర్ వైష్ణవి, డీజీఎం మద్రాస్ ఫెర్టిలైజర్ చంద్రశేఖర్, తహసీల్దార్ బీవీ రమణారావు, హెచ్‌ఎం కోటమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, హౌసింగ్ ఏఈ నాంచార్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ టీం సభ్యులు జాన్సీ, రూట్ ఇన్‌చార్జి జయశంకర్, టీబీ సూపర్‌వైజర్ చంద్రమౌళి, ఏవో మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌డీ హుస్సారా బేగం, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, బీజేపీ లీడర్ శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ కోడూరి వెంకటరెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ యేగయ్య, మండల అధ్యక్షుడు నాదారు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేసిన బాలినేని



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

నాగులుప్పలపాడు: మండలంలోని మద్దిరాలపాడు గ్రామానికి చెందిన స్వర్ణ సబీనాకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.6 లక్షల చెక్కును ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం అందజేశారు. మద్దిరాలపాడు గ్రామానికి చెందిన స్వర్ణ రవీంద్రబాబు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. అతని చికిత్సకు అయిన రూ.6 లక్షల ఖర్చును అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు బాలినేని చేతుల మీదుగా చెక్కు అందజేశారు. పార్టీ నాయకుడు జమండ్లమూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ

● పాల్గొన్న మాగుంట రాఘవరెడ్డి



పడిపూజలో పాల్గొన్న మాగుంట రాఘవరెడ్డి

ఒంగోలు మెట్రో: స్థానిక బాలకృష్ణపురం ఒకటో లైన్‌లో శుక్రవారం ముల్లంగి రవీంద్రరెడ్డి, బాకా బ్రదర్స్ ఘనంగా నిర్వహించిన అయ్యప్పస్వామి పడి పూజలో వైఎస్సార్ సీపీ నాయకుడు మాగుంట రాఘవరెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ వేద పురోహితులు రంగనాథచార్యులు పడిపూజ నిర్వహించగా, మాలలు ధరించిన స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు, భిక్ష స్వీకరించారు.

మహిళలపై వివక్షను నిర్మూలించాలి

● ఏపీఎం గోపీనాథ్



ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘ లీడర్లు, వీవోఏలు

ఒంగోలు రూరల్: బాలికలు, మహిళలపై వివక్షను పూర్తిగా నిర్మూలించాలని ఒంగోలు ఏపీఎం గోపీనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరవది సచివాలయంలో డ్వాక్రా సంఘ లీడర్లు, వీవోఏలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జండర్ మాసోత్సవం సందర్భంగా ఆడపిల్ల అంటే చులకనభావం, ఆడపిల్ల అని తెలియగానే గర్భంలోనే చిదిమేయడం, తదితర వివక్షను పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. నేడు ఆడపిల్లలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, రాజ్యాంగం కూడా వారికి సమాన హక్కులు కల్పించిందని తెలిపారు. అనంతరం వికసిత్ భారత్ గురించి సచివాలయ కార్యదర్శులు నాగేంద్రకుమార్, వేమా శ్రీలక్ష్మి కలిసి సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘ వీవోఏలకు వివరించారు. వికసిత్ భారత్‌లో సంక్షేమ కార్యక్రమాలపై గ్రామాల్లో పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ఈ నెల 10వ తేదీ వికసిత్ భారత్ వాహనం కరవది చేరుకుంటుందని, దాని ద్వారా సిబ్బంది కరవది చేరుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. డ్వాక్రా మహిళలు, గ్రామ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయంలో ప్రతిజ్ఞ చేశారు.

ఆడుదాం ఆంధ్ర ఆటస్థలం పరిశీలన...

కరవది జెడ్పీ హైస్కూలు, ఆటస్థలం, జూనియర్ కాలేజీ ఆటస్థలంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను కరవది గ్రామ కార్యదర్శులు, ఏపీఎం గోపీనాథ్ పరిశీలించారు. పక్కనే ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉన్న నేపథ్యంలో నీటి ఊట గ్రౌండ్‌లోకి వస్తున్నట్లు గుర్తించారు. అనంతరం హైస్కూలు హెచ్‌ఎం రవికుమార్‌ను కలిసి ఆడుదాం ఆంధ్రకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. హైస్కూలు గ్రౌండ్‌లోకి వస్తున్న నీటి ఊటను కాలువ ద్వారా కాలనీ కాలువకు అనుసంధానం చేస్తామని హెచ్‌ఎం రవికుమార్, కార్యదర్శులు, ఏపీఎం తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యంతో చదువుకోవాలి



విద్యార్థినులకు వైద్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వైష్ణవి

కొత్తపట్నం: విద్యార్థినులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే చదువులు ముందుకెళతాయని, చదివిన చదువు మైండ్‌కు ఎక్కి మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని కొత్తపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వైష్ణవి తెలిపారు. స్థానిక సాంఘిక సంక్షేమ సమీకృత బాలికల వసతి గృహంలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలుంటే దగ్గరలోని పీహెచ్‌సీకి వచ్చి చూపించుకోవాలని సూచించారు. పదో తరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థినులకు పీహెచ్‌సీ తరఫున బహుమతులు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకార్, వార్డెన్ అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శి అల్లెయ్య, ఏఎన్‌ఎం కవిత, ఆశా వర్కర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ఒంగోలు: ఈ నెల 29న నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సమితి జిల్లా అధ్యక్షుడు కవలకుంట్ల దయాకర్‌మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందన్నారు. తాజాగా జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు చెప్పారు. తాను అధ్యక్షునిగా, కూరపాటి రంగయ్య మాదిగ ఉపాధ్యక్షునిగా, ముద్ద ఎలీనా దీపాలత జిల్లా మహిళా అధ్యక్షురాలిగా, తాళ్లూరి విజయ్‌కుమార్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపికైనట్లు తెలిపారు.

రేపు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ఒంగోలు సెంట్రల్: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో వేడుకలు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభా వంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన తెలిపారు. దివ్యాంగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.